జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 16 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 9

## కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా స్వాగత దినోత్సవ వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఎగరవేసిన జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 15,(ప్రజాజ్యోతి )** 80 స్వతంత్ర దినోత్సవ వేడుకలను స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు, కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన జాతీయ పథకాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆవిష్కరించి జెండాను ఎగరవేశారు, కార్యక్రమానికి ముందు కలెక్టరేట్లో పోలీస్ సిబ్బంది చేపట్టిన కవాతును, వందన స్వీకారాన్ని ఆహ్వానించారు, ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ తో పాటు కలెక్టరేట్ కార్యాలయంలోని అన్ని విభాగాలకు చెందిన అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు





- అర్హులను వదలొద్దు
- అనర్హులకు ఉచితాలు ఇవ్వొద్దు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- అర్హత లేని వారు రేషన్ కార్డులను ప్రభుత్వానికి తిరిగి అందించాలి
- భద్రాద్రి కొత్తగూడెం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కృషి చేస్తోంది
- ఐదు నియోజకవర్గాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేయాలి
- పదవులు శాశ్వతం కాదు.. ప్రజల కోసం చేసిన పనులే శాశ్వతం

# అర్హులకే ఉచిత సంక్షేమ ఫలాలు అందాలి

**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 15,(ప్రజాజ్యోతి )** అర్హులైన పేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ ,చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అర్హులను వదలొద్దని, అనర్హులకు ఉచిత సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించవద్దని సూచించారు. రాష్ట్రంలో పేదవాడు ఆకలితో ఉండకూడదని, ఆకలి అనే మాట వినిపించకూడదనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ఆహార భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. శనివారం కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, ఇల్లెందు శాసనసభ్యులు కోరం కనకయ్య, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ గణేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆహార భద్రతలో భాగంగా అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు

మిగతా 2 లో...

## ఆగస్టు నెలాఖరులోగా మారేళ్లపాడు పనులు పూర్తి



**తుమ్మల చెరువుకు సాగునీరు అందిస్తాం: మంత్రి తుమ్మల**

**అశ్వాపురం, అగస్ట్ 15, ప్రజాజ్యోతి** అశ్వాపురం మండలంలోని మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేసి ఆగస్టు నెలాఖరులోగా తుమ్మల చెరువుకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. పనుల్లో ఇక ఎలాంటి జాప్యాన్ని సహించేది లేదని అధికారులను ఆదేశించారు.

**సీతారామ ప్రాజెక్టు పనుల పరిశీలన**

బిజీకొత్తూరు వద్ద సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్–1ను మంత్రి తుమ్మల,పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ తదితర అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం పంప్‌ను ప్రారంభించి గోదావరి జలాలను దిగువకు విడుదల చేశారు. డిస్ట్రిబ్యూటరీ కాలువలు, పైప్‌లైన్ పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీరు అందించాలని సూచించారు.

**రైతులకు న్యాయమైన పరిహారం**

ప్రాజెక్టు కోసం భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. రైతుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాజకీయ కారణాలతో ప్రాజెక్టు పనులకు ఆటంకం కలిగించరాదని, అవసరమైతే అధికార యంత్రాంగం సహకారంతో పనులు

మిగతా 2 లో...

## త్రివర్ణ పతాకంతో సీఆర్పీఎఫ్ బైక్ ర్యాలీ

- 151వ సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**చర్ల , ఆగస్టు 15:(ప్రజాజ్యోతి):** దేశ భక్తి ఉత్సాహంతో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను 151వ సీఆర్పీఎఫ్ బెటాలియన్ ఘనంగా నిర్వహించింది. కలివేరులోని బెటాలియన్ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన వేడుకల్లో కమాండెంట్ రాజీవ్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు.ఈ సందర్భంగా కమాండెంట్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ సీఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది దేశం పట్ల అచంచలమైన అంకితభావం, ధైర్యం, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. భిన్నత్వంలో ఏకత్వం, జాతీయ సమగ్రత, దేశ సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని అన్నారు. వందేమాతరం భారతదేశ సామూహిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు.అనంతరం రాష్ట్రపతి చేతుల మీదుగా శౌర్యం,

మిగతా 3 లో...

## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం

- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- అశ్వారావుపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవం
- లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**అశ్వారావుపేట, ఆగస్టు 15 (ప్రజా జ్యోతి):** దేశ స్వాతంత్ర్య సాధన కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలు చిరస్మరణీయమని, సంక్షేమ ఫలాలు మరియు సుపరిపాలనతో అశ్వారావుపేట నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్పష్టం చేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అశ్వారావుపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ జాతీయ పతాకాన్ని

మిగతా 2 లో...

## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం





(మొదటి పేజీ తరువాయి... )

ఆవిష్కరించి వందనం సమర్పించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి జాతీయ గీతం, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని భక్తిశ్రద్ధలతో ఆలపించారు.

**ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు:**

సభను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు నియోజకవర్గంలోని చివరి వ్యక్తి వరకు అందుతున్నాయని తెలిపారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని, ఈ ప్రగతి ప్రస్థానంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**ప్రశంసా పత్రాలు, లబ్ధిదారులకు సంక్షేమ ఫలాల అందజేత:**

విధుల్లో విశేష ప్రతిభ కనబరిచిన పలువురు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. అనంతరం వివిధ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు సహాయాన్ని పంపిణీ చేశారు:

**ఇందిరమ్మ ఇళ్లు & రేషన్ కార్డులు:** అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు.

**మహిళా సాధికారత:** మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.

**దివ్యాంగులకు చేయూత:** దివ్యాంగుల రవాణా సౌకర్యార్థం ప్రత్యేక ఎలక్ట్రికల్ త్రిచక్ర వాహనాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల అధికారులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆగస్టు నెలాఖరులోగా మారేళ్లపాడు పనులు పూర్తి



(మొదటి పేజీ తరువాయి... )

కొనసాగించాలని సూచించారు. మారేళ్లపాడు పనులను పరిశీలించిన మంత్రి, గతంలో నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గుత్తేదారులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఆగస్టు నెలాఖరులోగా పనులు పూర్తి చేసి రైతులకు నీరు అందించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ నాటికి సీతారామ ప్రాజెక్టు ద్వారా సుమారు మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు.

# అర్హులకే ఉచిత సంక్షేమ ఫలాలు అందాలి





(మొదటి పేజీ తరువాయి... )

అందిస్తూ కుటుంబంలోని ప్రతి సభ్యునికి నెలకు ఆరు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని, పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అదనపు వ్యయం చేస్తున్నప్పటికీ నిజమైన పేదల కడుపు నింపడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఉచిత సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన పేదలకే చేరాలని, అర్హత లేని వారు వాటిని పొందకుండా నిజమైన లబ్ధిదారులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆహార భద్రత కార్డులు కలిగి ఉండి, ప్రస్తుతం అర్హత లేని వారు తమ రేషన్ కార్డులను ప్రభుత్వానికి స్వచ్ఛందంగా తిరిగి అందించాలని మంత్రి కోరారు. అనర్హులు తమ కార్డులను ప్రభుత్వానికి రిటర్న్ చేయడం ద్వారా ఆ కార్డుల ద్వారా అందే ఆహార భద్రత ప్రయోజనాలు నిజమైన పేద కుటుంబాలకు చేరే అవకాశం కలుగుతుందని అన్నారు. అర్హత లేని వారు ప్రభుత్వ ప్రయోజనాలు పొందడం వల్ల నిజమైన పేదలకు అన్యాయం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించి అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందేలా సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాల ద్వారా కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించుకోవడంతో పాటు, పిల్లలను ఉన్నత విద్య చదివించి మంచి ఉద్యోగాలు సాధించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మంత్రి అన్నారు. పేద కుటుంబాలు శాశ్వతంగా అభివృద్ధి చెందాలంటే విద్య ఒక్కటే ప్రధాన మార్గమని తెలిపారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూనే పిల్లల విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించడం ద్వారా పేద కుటుంబాలు ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదుగుతాయని అన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. వీటి ద్వారా పేద కుటుంబాల పిల్లలకు కూడా నాణ్యమైన ఇంగ్లీష్ మీడియం విద్య అందుబాటులోకి వస్తుందని చెప్పారు. జిల్లాలో ఏకలవ్య, కస్తూర్బా, గురుకుల పాఠశాలల ద్వారా పేద, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని అన్నారు . ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య అందించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం



కృషి చేస్తోందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రకృతి సంపద, పచ్చని అడవులు, ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, పరిశ్రమలు, వ్యవసాయ రంగాలకు నిలయంగా ఉందని మంత్రి అన్నారు. జిల్లాలో అన్ని రంగాల్లో అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను అభివృద్ధిలో ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. కొత్తగూడెం బైపాస్ రోడ్డుకు రూ.420 కోట్లు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. ఎయిర్‌పోర్ట్ కోసం గుర్తించిన స్థలాన్ని పరిశీలించేందుకు కేంద్ర మంత్రిని కలిసి ఫిజిబులిటీ రావాలని కోరినట్లు వెల్లడించారు. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుతో జిల్లాలో పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధికి మరింత అవకాశం ఏర్పడుతుందని అన్నారు. కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌కు మరో జాతీయ రహదారిని మంజూరు చేయించామని, దీంతో హైదరాబాద్‌కు తక్కువ సమయంలో చేరుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. జిల్లాలో రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా భూవిజ్ఞానం, ఖనిజ వనరులు, పర్యావరణం తదితర రంగాల్లో ఉన్నత విద్య, పరిశోధనకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి అన్నారు. భూసేకరణకు అవసరమైన నిధులు అందుబాటులో ఉంచామని, భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో పనులు చేపట్టేందుకు టెండర్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీతారామ ప్రాజెక్టు పూర్తయితే జిల్లాలో సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని అన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని ఉన్న అన్ని చెరువులు నింపడం ద్వారా మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించగలమన్నారు సీతారామ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి జిల్లాలోని 10 నియోజకవర్గాలను సస్యశ్యామలం చేస్తామన్నారు. దీని ద్వారా జిల్లాలోని తుమ్మలచెరువు పెద వాగు సింగభూపాలెం ఇంటి చెరువులతోపాటు ఇతర చెరువులు నింపడం ముఖ్యమన్నారు దానికి గాను సీతారామ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూసేకరణను వేగవంతం చేయాలని దానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. కొత్తగూడెం పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో పట్టణానికి అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కొత్తగూడెంలో నూతన బస్టాండ్‌కు ప్రభుత్వం మంజూరు ఇచ్చిందని, బైపాస్ రోడ్డు నిర్మాణంతో పాటు రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. పదవులు శాశ్వతం కాదు.. ప్రజల కోసం చేసిన పనులే శాశ్వతమని మంత్రి అన్నారు. రాజకీయ పదవులు శాశ్వతం కాదని, ప్రజల కోసం చేపట్టిన అభివృద్ధి పనులే శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు . ప్రజాప్రతినిధులు పదవులను ప్రజా సేవకు ఉపయోగించుకోవాలని, జిల్లాలోని ఐదు నియోజకవర్గాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. సాగునీరు, రహదారులు, రైల్వే, విద్య, పరిశ్రమలు, మౌలిక వసతులు, పర్యాటక రంగాల్లో జిల్లాను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లా డుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారులకు మరింత పారదర్శకంగా అందుతాయని అన్నారు. లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదవుతుండటంతో అక్రమాలకు, ఒకరి పేరుతో మరొకరు ప్రయోజనాలు పొందే అవకాశాలకు అడ్డుకట్ట పడుతుందని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ప్రయోజనాలు చేరే అవకాశం మరింత మెరుగుపడుతుందని అన్నారు. జిల్లాలోని సింగరేణి రిటైర్డ్ కార్మికులు, అంగన్వాడి,ఆశ కార్యకర్తలు రెండు లక్షల లోపు తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలకు కూడా ఆహార భద్రత ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రతి అర్హ కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందించాలనే ఉద్దేశంతో నియోజకవర్గాల వారీగా కార్డుల పంపిణీ చేపట్టామని తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో మొత్తం 3,14,308 లామినేటెడ్ స్మార్ట్ పీడీఎస్ రేషన్ కార్డులు జారీ చేసినట్లు వెల్లడించారు. నియోజకవర్గాల వారీగా కొత్తగూడెంలో 86,001, పినపాకలో 76,321, భద్రాచలంలో 41,291, అశ్వారావుపేటలో 65,484, ఇల్లెందులో 45,211 స్మార్ట్ పీడీఎస్ రేషన్ కార్డులు జారీ చేసినట్లు వివరించారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారుల వివరాలు మరింత పారదర్శకంగా నమోదవుతాయని, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను సమర్థవంతంగా అందించేందుకు వీలవుతుందని తెలిపారు. ఎల్ నేను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 200300 చెరువులలో గత సంవత్సరంతో పాటు పోలిస్తే 50 శాతం తక్కువ నీటి నిల్వలు ఉన్నాయన్నారు కావున రైతులు వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటి వినియోగంతో పండే ఆరుతడి పంటలను పండించాలని అన్నారు. అనంతరం మంత్రి చేతుల మీదగా లబ్ధిదారులకు నియోజకవర్గాల వారీగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ కొత్తగూడెం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, మధ్యాహ్నం శాఖ అధికారి కిషోర్ బాబు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వాడ వాడల ఎగిరేనా మువ్వన్నెల జెండా





**ఇల్లందు, ఆగస్ట్ 15 (ప్రజా జ్యోతి)** 80 స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వాడవాడలా మువ్వన్నెల జెండాలను ఎగురవేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ కార్యాలయంలో చైర్పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, బిఆర్ఎస్ నియోజకవర్గ కార్యాలయంలో సీనియర్ నాయకుడు సిలివేరు సత్యనారాయణ, డీఎస్పీ కార్యాలయంలో డిఎస్పి యు వెంకన్న బాబు, పోలీస్ స్టేషన్ లో సీఐ తాటిపాముల సురేష్, తహసీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ షా ఖాసీమ్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో దన్ సింగ్, మునిసిపల్ వార్డులలో ఆయా వార్డు కౌన్సిలర్లు జెండాలను ఎగురవేశారు. అదేవిధంగా 13వ వార్డులో వార్డు కౌన్సిలర్ దండు సారయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జెండాను మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ ఎగురవేశారు.

**ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో...** 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఇల్లందు ప్రెస్ క్లబ్ లో ప్రధాన కార్యదర్శి తాడూరి శేఖర్ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మాటేటి మధుబాబు, గౌరవ అధ్యక్షుడు గుర్రం రాజేష్, గౌరవ సలహాదారు చాగర్ల సంతోష్, కోశాధికారి గౌరిశెట్టి విజ్ఞాన్, ఉపాధ్యక్షులు ఆవుల భాస్కర్, కల్లేపల్లి రవి, సహాయ కార్యదర్శులు గుగులోతు రాజేష్, రఫీ, చాంద్ పాషా, జర్నలిస్టులు బత్తుల రాధాకృష్ణ, వేమూరి రాజు, సరికొండ ప్రసాద్, అన్నారపు వెంకటేశ్వర్లు, డానియల్, ఏఎస్ రావు, నందు, పాశం రాకేష్, గంట మహేందర్ రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.



## త్రివర్ణ పతాకంతో సీఆర్పీఎఫ్ బైక్ ర్యాలీ





(మొదటి పేజీ తరువాయి...)

విశిష్ట సేవలకు పోలీస్ పతకాలు అందుకున్న సీఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది పేర్లను చదివి వినిపించారు. వారి సేవలు, అంకితభావం ఇతర సిబ్బందికి స్ఫూర్తిదాయకమని అధికారులు అన్నారు .స్వాతంత్ర్య దినోత్సవం, 'హర్ ఘర్ త్రివర్ణ' కార్యక్రమంలో భాగంగా 151వ బెటాలియన్ ఆధ్వర్యంలో త్రివర్ణ పతాక బైక్ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబూని సీఆర్పీఎఫ్ సిబ్బంది, స్థానిక గ్రామస్తులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. సీఆర్పీఎఫ్, స్థానిక ప్రజల మధ్య ఉన్న పరస్పర విశ్వాసం, సామరస్యానికి ఈ ర్యాలీ ప్రతీకగా నిలిచింది.దక్షిణ బస్తర్‌లోని మారుమూల ప్రాంతాల్లో మోహరించిన 151వ బెటాలియన్ ఉప యూనిట్ల ఆధ్వర్యంలోనూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పలు గ్రామాల్లో తొలిసారిగా స్వాతంత్ర్య వేడుకలు జరగడంతో స్థానిక ప్రజల్లో ఉత్సాహం నెలకొంది.అనంతరం పాల్గొన్న వారికి మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సెకండ్-ఇన్-కమాండ్ నితిన్ షిండే, డిప్యూటీ కమాండెంట్ అశుతోష్ సారంగి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహమ్మద్ అజార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక గ్రామస్తులు, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**చర్ల, ఆగస్టు 15(ప్రజా జ్యోతి):** చర్ల మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చర్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను నాయకులు స్మరించుకున్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, దేశ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు, చర్ల పీఏసీఎస్ చైర్మన్ పరుచూరి రవికుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జవ్వాది రవికుమార్, మేడిచర్ల కుమార్, మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ కాపుల కృష్ణార్జున రావు, ఆత్మ కమిటీ సభ్యులు అలవాల మహేష్ నాయుడు (బాలు), సుందరి సురేష్, పటేల్ వెంకటేశ్వర్లు, తోటమల్ల వరప్రసాద్, దోమల రవికాంత్, వొల్లే శ్రీకాంత్, బండి వేణు, సేవాదళ్ మండల అధ్యక్షుడు చల్లకోటి వాసు, పూజారి రమణయ్య, మునిగెల వెంకన్న, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు బోర పెద్ది రాజు, చర్ల మండల యూత్ అధ్యక్షుడు జితేంద్ర నాయుడు (జిట్టు), ఎస్సీ సెల్ ప్రచార కార్యదర్శి చల్లా పవన్, టాటా మ్యాజిక్ యూనియన్ నాయకులు కృష్ణ, బుచ్చయ్య, శ్యామల తరుణ్, కణితి శ్రీను, చెన్నం రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాల్లో జాతీయ జెండా రెపరెపలు



**చర్ల ,ఆగస్టు 15 :(ప్రజా జ్యోతి):** దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి ఏళ్లు గడుస్తున్నా దేశానికి వెన్నెముకగా నిలుస్తున్న రైతులు, శ్రామికులే అసలైన బలమని చాటిచెబుతూ ఆర్. కొత్తగూడెం గ్రామంలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వినూత్నంగా నిర్వహించారు. నిత్యం చెమటోడ్చి సమాజానికి అన్నం అందిస్తున్న రైతులు, వ్యవసాయ కూలీలు పచ్చని పంట పొలాల మధ్య జాతీయ పండుగను ఘనంగా జరుపుకున్నారు.పొలాల్లో పనులు ప్రారంభించే ముందు రైతులు, కూలీలు, గ్రామస్తులు ఐక్యంగా మువ్వన్నెల జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం జెండాకు వందనం చేసి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. దేశ అభివృద్ధిలో రైతులు, శ్రామికుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు .కార్యాలయాలు, పాఠశాలలకే పరిమితం కాకుండా నేలతల్లి సాక్షిగా పంట పొలాల మధ్య రైతులు, కూలీలు కలిసి జాతీయ పండుగను జరుపుకోవడం స్థానికంగా విశేష ఆదరణ పొందింది. రైతు కూలీల ఐక్యతను మండల ప్రజలు, గ్రామ పెద్దలు అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు పూచి హెలేష్, పూజారి సంధ్య, చిమిడి నవీన్, ముప్పిడి వెంకటేష్, ఆళ్ల కార్తీక్, బుర్రం శివ, ఆళ్ల ప్రసన్న కుమార్, కుక్కడపు నరేష్, చిమిడి సుజాత, ముప్పిడి చిన్న రమణ, బుర్రం అశ్విని పాల్గొన్నారు.

## పాల్వంచ నటరాజ్ సెంటర్‌లో జాతీయ పతాక ఆవిష్కరణ

- 38వ డివిజన్ కార్పొరేటర్ బత్తుల మధుచంద్
- విశిష్ట అతిథిగా పాల్గొన్న ఎన్ఆర్ఐ కుప్పాల గణేష్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 15,(ప్రజాజ్యోతి)** పాల్వంచలోని నటరాజ్ సెంటర్ మెయిన్ రోడ్ వద్ద 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకులు, పాల్వంచ 38వ డివిజన్ కార్పొరేటర్ బత్తుల మధుచంద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఎన్ఆర్ఐ కుప్పాల గణేష్ పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు, భారతదేశం, తెలంగాణ అభివృద్ధిలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా భాగస్వామి కావాలని, దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరంకార్పొరేటర్ బత్తుల మధుచంద్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం అంటే కేవలం బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందడం మాత్రమే కాదని, మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, పేదలకు అండగా నిలవడం, మన ఊరి అభివృద్ధికి కృషి చేయడం ద్వారా నిజమైన స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, 38వ డివిజన్ ప్రజలు, మహిళలు,హైటెక్ ఫ్యామిలీ సలూన్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- దేశాభివృద్ధికి అందరూ భాగస్వాములు కావాలి-నూప రమేష్



**చర్ల, ఆగస్టు 15:(ప్రజా జ్యోతి):** భారతీయ జనతా పార్టీ చర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు నూప రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు.ఈ సందర్భంగా నూప రమేష్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ తదితర స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. వారి అంకితభావం, దేశభక్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశ సేవతో పాటు దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు జాతీయ గీతాన్ని ఆలపించి, 'భారత్ మాతా కీ జై' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు బాబా పాహిం, మండల కార్యవర్గ సభ్యుడు గూనూరి రమణ, మండల ప్రధాన కార్యదర్శి బి.సందీప్, కార్యదర్శులు ముత్తవరపు శ్రీనివాస్ చారి, కుప్పా మాధవరావు, విశ్వనాథం, వెంబడి హరినాథ్, నాగయ్య, నరసింహమూర్తి, శ్రావణి, పావని తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీపీఎం ఆధ్వర్యంలో మువ్వన్నెల జెండా ఆవిష్కరణ



**చర్ల, ఆగస్టు 15(ప్రజా జ్యోతి):** చర్ల మండల కేంద్రంలోని బీఎస్ రామయ్య భవన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బందెల చంటి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, రాజ్‌గురు, సుభాష్ చంద్రబోస్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి మచ్చ రామారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బందెల చంటి, దొడ్డి హరినాథ వర్మ, కొట్టి నవీన్ మాట్లాడుతూ మండల ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు పూర్తయినా పేదలు, కార్మికులు, రైతుల జీవన పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు భీమగోని నవీన్, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా మండల కన్వీనర్ ఉడుగుల షారోన్, ఐద్వా మండల కార్యదర్శి పొడుపుగంటి సమ్మక్క, వరదల వరలక్ష్మి , సీపీఎం వార్డు సభ్యురాలు కట్టం స్పందన, మండల కమిటీ సభ్యులు శ్యామల చంద్రం, రైతు సంఘం అధ్యక్షుడు శ్యామల వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు దొడ్డి హరినాథ వర్మ, శ్రీ గణేష్ ఆటో యూనియన్ అధ్యక్షుడు పామర్ బాలాజీ, ఉపాధ్యక్షుడు బి.సత్తిరాజు, యూత్ అధ్యక్షుడు కంచర్ల సతీష్, సీనియర్ నాయకులు గురునాథం, రాంబాబు, సంజీవరావు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**చర్ల, ఆగస్టు 15:(ప్రజా జ్యోతి):** చర్ల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంతో పాటు ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజాసేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండెపూడి భాస్కర్‌రావు, ఆవుల పుల్లారావు, మెడబట్టిన వాసు, బండి వేణు, కర్నాటి భాస్కర్‌రావు, కజ్జం భాస్కర్, తాండవ రాయుడు, మాజీ ఎంపీటీసీ మడకం పద్మజ, ఎస్టీ సెల్ నాయకుడు తాటి రామకృష్ణ, తెల్లం కన్నయ్య, ఝంజ రాజా, కారం సుధాకర్, ఇర్ప వేణు, పొగాకు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవం వేడుకలు



**ఇల్లందు ఆగస్టు 15 (ప్రజా జ్యోతి)**80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం మండలంలోని చిన్నంగుల గడ్డ బాలుర ఆశ్రమ పాఠశాలలో హెచ్ఎం బానోత్ నామ జెండాలు ఎగురవేశారు. ముందుగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అదేవిదంగా వివిధ నాయకుల వేషధారణ అందరినీ అలరించింది. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వివిధ ఆటల పోటీలు గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మండల వ్యాప్తంగా ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**బూర్గంపహాడ్, ఆగస్టు 15 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండల వ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, రాజకీయ పార్టీ కార్యాలయాలు, విద్యాసంస్థలు తదితర ప్రాంతాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దేశభక్తి గీతాలు, జాతీయ గీతాలాపనతో ఆయా ప్రాంతాల్లో దేశభక్తి భావం వెల్లివిరిసింది.

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు**

బూర్గంపహాడ్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపెల్లి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాకు వందనం చేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో మహనీయులు చేసిన పోరాటం, త్యాగాలను నాయకులు గుర్తుచేశారు. స్వాతంత్ర్య సమరయోధులు చూపిన స్ఫూర్తితో నేటి తరం దేశ ప్రగతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం అనేది ఎంతోమంది మహనీయుల త్యాగాల ఫలితమని, దేశ సమగ్రాభివృద్ధి, సామాజిక సమానత్వం, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

**పంచాయతీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు**

బూర్గంపహాడ్ మండలం మేజర్ గ్రామ పంచాయతీ సారపాకలో కూడా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్, పంచాయతీ ఈవో రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుని వారికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ తదితరులు చేసిన పోరాటం, త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. అహింస, సత్యాగ్రహ మార్గాల్లో మహాత్మా గాంధీ దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని వివరించారు. దేశ తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతో పాటు, స్వాతంత్ర్యం అనంతరం దేశ నిర్మాణంలో విశేష కృషి చేశారని సర్పంచ్ పేర్కొన్నారు. ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని అన్నారు. నేటి యువత స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను, వారి త్యాగాలను ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

**గ్రామాభివృద్ధికి సమష్టి కృషి అవసరం...**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్రామాభివృద్ధి అంశాన్ని సర్పంచ్ ప్రస్తావించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పని చేసినప్పుడే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, రహదారులు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో రవికుమార్, పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి, జాతీయ స్ఫూర్తిని చాటుతూ ఉత్సాహ భరిత వాతావరణంలో కొనసాగాయి.

## శ్రీ సరస్వతి విద్యానికేతన్ లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- త్రివర్ణ పతాకాలతో విద్యార్థుల ర్యాలీ
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



**చర్ల, ఆగస్టు 15(ప్రజా జ్యోతి):** చర్లమండలంలోని తేగడ లో గల శ్రీ సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకల్లో ముఖ్య అతిథి సత్యనారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. జెండా ఆవిష్కరణ అనంతరం విద్యార్థులు చేతుల్లో త్రివర్ణ పతాకాలను పట్టుకుని గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. 'భారత్ మాతా కీ జై', 'వందేమాతరం' నినాదాలతో విద్యార్థులు ఉత్సాహంగా ముందుకు సాగడంతో వీధులు దేశభక్తి నినాదాలతో మారుమోగాయి. విద్యార్థుల క్రమశిక్షణతో కూడిన ర్యాలీ స్థానికులను ఆకట్టుకుంది. ఈ సందర్భగా పాఠశాల డైరెక్టర్ లిఖిత మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలు, త్యాగాలను నేటి తరానికి పరిచయం చేయడంతో పాటు విద్యార్థుల్లో దేశభక్తి, మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీసిన ఉపాధ్యాయులను ఆమె అభినందించారు. ప్రధానోపాధ్యాయురాలు అరుణ మాట్లాడుతూ విద్యార్థులను కేవలం విద్యలోనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర రంగాల్లోనూ రాణించేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. భావి భారత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు పాఠశాల యాజమాన్యం కృషి చేస్తోందన్నారు. గ్రామస్తులు పాఠశాలకు సహకరించి విద్యార్థుల భవిష్యత్ కు తోడ్పడాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమాన్ని ఉపాధ్యాయురాలు రాజేశ్వరి సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, శ్రీదేవి, ప్రమీల, శ్రావణి, పూజ, శైలజ తదితరులు పాల్గొన్నారు .

## మదర్సాలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 15,(ప్రజాజ్యోతి )**పాల్వంచ పట్టణంలోని దారుల్ ఉలూం నూరియాహనఫియా మదర్సాలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మదర్సా ఫౌండర్, చైర్మన్ ఎండీ యాకూబ్ పాషా ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు, ఈ సందర్భంగా యాకూబ్ పాషా మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు దేశభక్తి, క్రమశిక్షణ, మానవతా విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్.కె. దస్తగిర్, ఎం.డి. ఈక్బాల్, గౌష్ పాషా, గుంషావలి, వసీం తదితరులతో పాటు మదర్సా అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని పాల్వంచకు వచ్చిన సీనియర్ జర్నలిస్టు ప్రజా జ్యోతి కొత్తగూడెం కలెక్టరేట్ రిపోర్టర్ గాదేపల్లి వీరభద్రమును టీచర్స్ కాలనీలోని భద్రం నివాస గృహంలో ఆయనను కలుసుకొని పరామర్శించారు, ఈ కార్యక్రమంలో ఎండి యాకూబ్ పాషా తో పాటు మైనార్టీ యూత్ జిల్లా అధ్యక్షులు మాజీద్ ఖురేషి, కలీం ,గౌస్ పాషా, మజహార్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రిలియంట్ విద్యాసంస్థల్లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**బూర్గంపహాడ్,ఆగస్టు 15 (ప్రజా జ్యోతి):** స్థానిక బ్రిలియంట్ విద్యాసంస్థల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ డా. బి.ఎన్.ఆర్. జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలో ఆకట్టుకున్నారు. మువ్వన్నెల జెండాలను చేతబట్టి, జాతీయ నినాదాలతో సారపాక పురవీధుల్లో నిర్వహించిన ర్యాలీ దేశభక్తిని చాటింది. ఈ సందర్భంగా డా. బి.ఎన్.ఆర్. మాట్లాడుతూ, స్వాతంత్ర్యం సాధించి 80 ఏళ్లు పూర్తయిన వేళ దేశ అస్తిత్వం, ఆత్మగౌరవానికి ప్రతీక అయిన త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేస్తున్నామని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు కలలు కన్న అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో నేటి విద్యార్థుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. దేశం పట్ల గౌరవం, జాతీయ ఐక్యతను పెంపొందించుకుంటూ ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. జాతులు, మతాలు వేరైనా మనమంతా భారతమాత బిడ్డలమేనని అన్నారు.స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపూజీ, నేతాజీ, రవీంద్రనాథ్ ఠాగూర్ గ్రూపుల మధ్య నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, సాంస్కృతిక పోటీల్లో విజేతలైన విద్యార్థులకు చైర్మన్ డా. బి.ఎన్.ఆర్., హెడ్మిస్ట్రెస్ స్వర్ణకుమారి బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మండల వ్యాప్తంగా వెల్లివిరిసిన స్వాతంత్ర్య స్ఫూర్తి

- ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఉత్సాహంగా వేడుకలు





**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 15 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల వ్యాప్తంగా శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఊరూరా, వాడవాడలా జాతీయ జెండాలు రెపరెపలాడాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో రాజేశ్వరి ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక అధికారి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై విజయసింహారెడ్డి, ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి నజ్ నిన్ తబసుమ్, మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో సర్పంచులు వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు పాఠశాలల్లో విద్యార్థులకు సీట్లు, పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు.

## ప్రెస్ క్లబ్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**ములకలపల్లి, ఆగస్టు 15, (ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ములకలపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముదిగొండ శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండాకు వందనం చేశారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి ఉప సర్పంచ్ పువ్వాల లాలితారావు, గ్రామ పెద్దలు పువ్వాల మంగపతి, శనగపాటి రవి, సుభాని, బొమ్మా కామేశ్వరరావు, మండల పశు వైద్యాధికారి పి. రామకృష్ణ, ప్రెస్ క్లబ్ సభ్యులు బండారి శివ ప్రసాద్, పువ్వాల శ్రీనివాసరావు, బి సాగర్, అడపా సురేష్, షేక్ బషీర్, యలమంచిలి సునీల్ కుమార్, ఇనుకుర్తి రాము తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**గుండాల ఆగస్టు 15 ప్రజాజ్యోతి** గుండాల మండల కేంద్రంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ బత్తిని సంగీత జండా ఎగరవేయగా, మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి బాలరాజు, పోలీస్ స్టేషన్లో సీఐ తిరుపతి, ప్రెస్ పవన్ ముందు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు యాసారపు తిరుపతి, మండల విద్యా వనరుల ముందు ఎంఈఓ పార్వతమ్మ, ఫారెస్ట్ కార్యాలయంలో రేంజర్ నాగేశ్వరరావు, వివిధ పాఠశాలలు ప్రభుత్వ కార్యాలయాలు హాలో ఆయా అధికారులు జెండాను ఎగురవేశారు గుండాల ప్రగతి స్కూల్లో కరస్పాండెంట్ తాటిపల్లి సత్యం ఎండ ఎగరవేశారు గుండాల ఉన్నత పాఠశాలలో పాఠశాలలో పనిచేసే పదవి రిటైర్మెంట్ అయిన గ్రామాలపాటి లక్ష్మయ్య జ్ఞాపకార్థ ఆటల పోటీలు కుటుంబ సభ్యులు నిర్వహించారు కమలపాటి లక్ష్మయ్య జ్ఞాపకార్థంగా నిర్వహించిన పోటీల విజేతలకు కుటుంబ సభ్యులు బహుమతులను అందించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ శాంతయ్య హెచ్ఎం పార్వతమ్మ వివిధ పార్టీల నాయకులు స్థానికులు పాల్గొన్నారు

## రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

- మండల వ్యాప్తంగా ఘనంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**ములకలపల్లి, ఆగస్టు 15, (ప్రజాజ్యోతి):** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. మండల వ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ స్వాతి బిందు పోలీసుల గౌరవ వందనం నడుమ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా ఎంపీడీవో కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ రమేష్, ఉపాధిహామీ కార్యాలయంలో ఏపీఓ హుస్సేన్, వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఓ అరుణ్ బాబు, రక్షకభట నిలయంలో ఎస్సై మధుప్రసాద్, గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ సునీత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సాయి కళ్యాణ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యాలయాల్లో ఆయా పంచాయతీల సర్పంచులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మాతృభూమి కోసం ఎందరో తమ ధన, మాన, ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. ఎందరో మహనీయుల కృషి, త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. వారి స్ఫూర్తితో ప్రజలందరూ దేశ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో అధికారులు, వివిధ పార్టీల నాయకులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## అక్రమంగా తరలిస్తున్న 300 క్వింటాల పిడిఎస్ బియ్యం పట్టివేత



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 15,( ప్రజా జ్యోతి )** పాల్వంచలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 300 క్వింటాల రేషన్ బియ్యాన్ని పాల్వంచ పోలీసులు శనివారం పట్టుకున్నారు , వివరాలు ఇలా ఉన్నాయి, పాల్వంచ పట్టణ పోలీసులు ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పాల్వంచ అల్లూరి సెంటర్‌లోని రామాంజనేయ రైస్ మిల్ సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న ఒక లారీని గుర్తించారు.పోలీసులు వెంటనే లారీని తనిఖీ చేయగా టీఎస్ 05 యు సి 1889 నంబర్ గల లారీలో సుమారు 300 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 620 బస్తాల్లో తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీ డ్రైవర్‌ను విచారించగా అతని పేరు ఎస్.కె. ఖాజా మొయినుద్దీన్,నివాసం వల్లాపురం గ్రామం, నిడిగూడ మండలం, సూర్యాపేట జిల్లా అని వెల్లడించాడు.ఇతనిని పీడీఎస్ బియ్యాన్ని ఎటువంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు, లేదా అనుమతులు లేకపోవడం వలన.పీడీఎస్ బియ్యాన్ని ఎటువంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు లేదా అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో క్రింది వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు కూడా పోలీసులు గుర్తించారు, వీరిలో నరిగే రవీంద్ర – రామాంజనేయ రైస్ మిల్ యజమాని, కొండ్లే వెంకటేశ్వరరావు – పాల్వంచ బ్రోకర్, విదియాల శ్రీను – మిర్యాలగూడ బ్రోకర్, నూతక్కి వాసు – ధీరజ్ రైస్ మిల్స్, మిర్యాలగూడ, ఎస్.కె. పాషా – లారీ యజమాని, అసోదు సుధాకర్ – తండ్రి వెంకట నర్సు, లారీ యజమాని ఏజెంట్ గా ఉన్నట్లు నిర్ధారించారు, దీంతో వెంటనే లారీ, డ్రైవర్ , అందులో ఉన్న సుమారు 300 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని, భద్రత నిమిత్తం పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో మరికొందరి వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు కూడా గుర్తించబడిందన్నారు ,నిబందనల ప్రకారం సదరు పీడీఎస్ బియ్యాన్ని జిల్లా పౌర సరఫరాల అధికారి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారు పరిశీలన నిమిత్తం సదరు జిల్లా పౌర సరఫరాల అధికారి కి సమాచారం అందించారు, రిపోర్ట్ అనంతరం నిబంధనల మేరకు అక్రమ తరలిస్తున్న పిడిఎఫ్ బియ్యం పై విచారణ కొనసాగిస్తున్నారు

## ఉత్తమ సేవలు.. ప్రశంసా పత్రాలతో సత్కారం

- వివిధ శాఖల్లో సేవలు అందించిన ఉద్యోగులకు గుర్తింపు




**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 15 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలంలో వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో గుర్తింపు లభించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా వీరికి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. వ్యవసాయ శాఖ మండల వ్యవసాయ అధికారి అనూష, అన్నపురెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్, విద్యుత్ శాఖ ఏఈ సాయితరుణ్, అన్నపురెడ్డిపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ సీనియర్ అసిస్టెంట్ ఉడతనేని రామారావు, ఉత్తమ లైన్మెన్ ఎల్లయ్యలు తమ తమ శాఖల్లో ఉత్తమ సేవలు అందించినందుకు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. విధులను బాధ్యతగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించినందుకు వీరికి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలు అందుకున్న ఉద్యోగులను అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

## మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు





**చర్ల, ఆగస్టు 15:(ప్రజాజ్యోతి):** చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు.ఈ సందర్భంగా చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల సేవలను స్మరించుకోవాలని అన్నారు. వారి త్యాగాలు, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశ ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, చర్ల పీఏసీఎస్ చైర్మన్ పరుచూరి రవికుమార్, జవ్వాది రవికుమార్, ఆవుల విజయభాస్కర్ రెడ్డి, సుందరి సురేష్, మేడిచర్ల వీరకుమార్, చల్లకోటి వాసు, పెద్దిరాజు, తోట మల్ల వరప్రసాద్, పటేల్ వెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి, బాల బాలు, పరిటాల సంతోష్, మునిగెల వెంకన్న, పూజారి రమణయ్య, జితేంద్ర నాయుడు, దోమల రవి, కణితి శ్రీనివాసరావు తదితర నాయకులు, రైతులు, చర్ల మ్యాజిక్ యూనియన్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

## జనసేన ఆధ్వర్యంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- **ఉత్సాహంగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు**



**దమ్మపేట, ఆగస్టు 15(ప్రజాజ్యోతి):** దమ్మపేట గ్రామంలోని జనసేన దిమ్మ వద్ద 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జనసేన మండల అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించి, జెండాకు వందనం చేశారు. అనంతరం దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుని ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకల్లో జనసేన వార్డ్ మెంబర్ సరిత, నాయకులు గోపిశెట్టి శ్యామ్, మల్ల శ్రీను, పోతిని మహేష్, చెన్నకేశవ రావు, గుల్లా రాంబాబు, దాసరోజు రామారావు, రంజిత్, కొండపర్వ చిన్న తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు పెద్ద సంఖ్యలో జనసేన పార్టీ కార్యకర్తలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం దేశభక్తి నినాదాలతో జనసేన దిమ్మ పరిసరాలు మార్మోగాయి.

# మందలపల్లిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- **గ్రామపంచాయతీ కార్యాలయం, అంబేద్కర్ సెంటర్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ**



**దమ్మపేట, ఆగస్టు 15(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలంలోని మందలపల్లి గ్రామంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో, అలాగే అంబేద్కర్ బొమ్మ సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ గుజ్జుల శ్రీనివాసరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, అంబేద్కర్ బొమ్మ సెంటర్‌లో దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు తనగల తిరుపతిరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ పతాకానికి వందనం చేసి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే నేడు దేశ ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములై, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ గుజ్జుల శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ మురళి , గ్రామపంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్ , మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పర్వతనేని ప్రసాద్ , గ్రామ శాఖ అధ్యక్షులు, వార్డు సభ్యులు, ఎస్సీ సెల్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, యువత, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ పతాక ఆవిష్కరణ అనంతరం దేశభక్తి నినాదాలతో మందలపల్లిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉత్సాహంగా కొనసాగాయి.

# గురువుల జ్ఞాపకాలు.. విద్యార్థులకు భవిష్యత్ బాటలు

- **2006–07 ఎస్సెస్సీ బ్యాచ్ ఆధ్వర్యంలో మల్లెలమడుగు పాఠశాలలో ఘనంగా పూర్వ విద్యార్థుల కలయిక – ప్రతిభావంతులకు బహుమతులు**



**అశ్వాపురం, ఆగస్టు 15:ప్రజాజ్యోతి** అశ్వాపురంలో తాము చదువుకున్న పాఠశాలతో ఉన్న అనుబంధాన్ని మరచిపోకుండా, నేటి విద్యార్థుల భవిష్యత్తు కు అండగా నిలుస్తూ మల్లెలమడుగు పూర్వ విద్యార్థులు ఆదర్శంగా నిలిచా రు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మల్లెలమడుగు పాఠశాలలో ఎస్సెస్సీ 2006–07 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆత్మీయ కలయికతో పాటు ప్రస్తుత పదో తరగతి విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాన్ని నిర్వహించారు.

**20 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరిన స్నేహితులు**

2006–07 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్నారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడంతో పాటు పాఠశాలలో గడిపిన మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తరగతి గదుల్లో గడిపిన రోజులు, గురువుల బోధనలు, స్నేహితులతో పంచుకున్న అనుభవాలను గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

**విద్యార్థులకు ప్రోత్సాహకాలు**

ప్రస్తుత పదో తరగతి విద్యార్థుల్లో చదువులో ప్రతిభ కనబరుస్తున్న వారికి పూర్వ విద్యార్థులు బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించడంతో పాటు, మరింత కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో ఈ ప్రోత్సాహకాలను అందించినట్లు తెలిపారు. విద్యార్థులు కేవలం పరీక్షల్లో మంచి మార్కులు సాధించడమే కాకుండా, జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు.

**తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలి**

విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుల పేరును నిలబెట్టాలని పూర్వ విద్యార్థులు ఆకాంక్షించారు. మల్లెలమడుగు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలంటే విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమను అలవర్చుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యకు ఉన్న ప్రాధాన్యతను వివరించి, ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు, ఉన్నత స్థానాలను సాధించాలని కోరారు.

**పాఠశాల రుణం తీర్చుకునే ప్రయత్నం**

తమ జీవితంలో పాఠశాలకు ప్రత్యేక స్థానం ఉందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. తమకు అక్షర జ్ఞానంతో పాటు జీవితాన్ని ఎలా ఎదుర్కోవాలో నేర్పిన గురువులను ఎప్పటికీ మరచిపోలేమన్నారు. పాఠశాల తమకు అందించిన సేవలకు కృతజ్ఞతగా నేటి విద్యార్థులకు తమవంతుగా సహాయం చేయాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. తాము విద్యార్థులుగా ఉన్న సమయంలో గురువులు, పెద్దలు అందించిన ప్రోత్సాహం తమ ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడిందని, అదే స్ఫూర్తిని ప్రస్తుత విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో ప్రతిభావంతులను సన్మానించి బహుమతులు అందిస్తున్నట్లు వివరించారు.

**మంచి సంప్రదాయానికి శ్రీకారం**

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కేవలం జ్ఞాపకాలను గుర్తుచేసుకోవడంతో ముగియకుండా, పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రోత్సాహానికి ఉపయోగపడే విధంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తూ విద్యార్థులకు అవసరమైన సహకారం అందించేందుకు కృషిచేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

పూర్వ విద్యార్థులు ప్రారంభించిన ఈ కార్యక్రమం ప్రస్తుత విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించడం ద్వారా ఇతర విద్యార్థులు కూడా మరింత పట్టుదలతో చదివేందుకు ప్రేరణ కలిగింది. పాఠశాల, గురువులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థుల మధ్య ఉన్న అనుబంధానికి ఈ కార్యక్రమం చక్కటి నిదర్శనంగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో 2006–07 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పురమ సతీష్, చల్లంగి రాము, సామకూరి సాగర్, తులసి హేమాశ్రీ, గంధం బాలకృష్ణ, రెడ్డిరాజుల శ్రీకాంత్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగి, పూర్వ విద్యార్థులు తమ పాఠశాల జ్ఞాపకాలను పంచుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## పోలీస్ స్టేషన్‌లో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

**దమ్మపేట, ఆగస్టు 15(ప్రజాజ్యోతి):** దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎస్సై రాజేష్ కుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. ప్రజల శాంతిభద్రతల పరిరక్షణ, చట్టాల అమలులో పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు చట్టాలను గౌరవిస్తూ దేశ సమగ్రత, శాంతిభద్రతలకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు. దేశభక్తి నినాదాలు, జాతీయ గీతాల మధ్య వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.



# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వాతంత్ర్య వేడుకలు

- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి-ప్రిన్సిపాల్ నరేందర్





**చర్ల, ఆగస్టు 15:(ప్రజా జ్యోతి):** చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేందర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నరేందర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది మహనీయులు చేసిన త్యాగాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించడంతో పాటు తమ ప్రతిభను దేశాభివృద్ధికి వినియోగించాలని అన్నారు. విద్యతో పాటు సామాజిక బాధ్యతను కూడా అలవర్చుకోవాలని సూచించారు.నేటి యువత రాజకీయ రంగంలో నూ చురుకుగా పాల్గొని ప్రజాసేవకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రిన్సిపాల్ అన్నారు . అవినీతి రహిత పాలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. భారతదేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లి ప్రపంచానికి ఆదర్శంగా నిలిపే బాధ్యత యువతపై ఉందని తెలిపారు.అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా అందించిన పుస్తకాలు, బ్యాగులు, షూస్‌ను కళాశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ చింతల వజ్రమ్మ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా సహాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని ఈ సందర్భంగా సూచించారు.తదుపరి కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు దేశభక్తిని ప్రతిబింబించేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల పాటలు, నృత్యాలు, ఇతర ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రతిభను అధ్యాపకులు అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మహా పాదయాత్రను జయప్రదం చేయండి

- జిఎస్పి ఉభయ రాష్ట్రాల కన్వీనర్ సోంది వీరయ్య



**చర్ల, ఆగస్టు 15:(ప్రజా జ్యోతి):** ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణకు గోండ్వానా యువత ముందుండాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ (జీఎస్పీ) ఉభయ రాష్ట్రాల కన్వీనర్ సోంది వీరయ్య పిలుపునిచ్చారు. చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం జీఎస్పీ నాయకుల సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర అధ్యక్షతన జరిగిన సమావేశానికి సోంది వీరయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్‌లో ఆదివాసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలను పొందుపరిచారని వాటిని నిర్వీర్యం చేసేందుకు కొన్ని రాజకీయ శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులకు భంగం కలిగించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. 1/70 చట్టాన్ని ఏజెన్సీ ప్రాంతాల్లో పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.భద్రాచలం కేంద్రంగా గోండ్వానా న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఆగస్టు 17న ఎదురుగుట్టల నుంచి భద్రాచలం ఐటీడీఏ వరకు నిర్వహించనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని ఆదివాసీ యువత, మేధావులు, ప్రజా సంఘాలకు పిలుపునిచ్చారు. న్యాయ కళాశాల ఏర్పాటు చేస్తే ఆదివాసీ యువతకు తమ ప్రాంతానికి సంబంధించిన చట్టాలు, ప్రభుత్వ జీవోలపై అవగాహన పెరుగుతుందని అన్నారు. గతంలో అమలులో ఉన్న జీవో నంబర్ 3 ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు లభించాయని సోంది వీరయ్య పేర్కొన్నారు. జీవో నంబర్ 3 రద్దుతో ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాలు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో రద్దుపై ప్రభుత్వం సమగ్రంగా నిజనిర్ధారణ చేయాలని డిమాండ్ చేశారు.ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో 'జల్, జంగల్, జమీన్' నినాదంతో ఆదివాసీలు తమ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో జీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి కిషోర్, జిల్లా అధ్యక్షుడు బీరబోయిన శేఖర్, మహిళా కార్యదర్శి బీరబోయిన అరుణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొంది లీలాప్రసాద్, మండల అధ్యక్షుడు ఇర్ప అంజిబాబు, కాయం శ్రీనివాసరావు, సున్నం సుబ్బయ్య, పాయం సన్యాసి పాల్గొన్నారు.

# బాలికల పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ పోటీలు

- మొట్టమొదటి సారి వాసవి క్లబ్ పార్టిసిపేటెడ్ సర్టిఫికెట్స్
- విద్యార్థులకు బహుమతులు ప్రతిభకు ప్రోత్సాహం

**ఇల్లందు, ఆగస్ట్ 15 (ప్రజా జ్యోతి)** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం వాసవి క్లబ్ ఇల్లందు, వనితా క్రౌన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, డిబేట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 40 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మెమెంటో, సర్టిఫికెట్, నోట్‌బుక్, పెన్ అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి వాసవి క్లబ్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్, నోట్‌బుక్, పెన్ అందించి ప్రోత్సహించారు. గత విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఇద్దరు విద్యార్థులను ప్రత్యేకంగా సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా జోన్ చైర్మన్ బోనగిరి రవి కిరణ్ మాట్లాడుతూ గత సంవత్సరం అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల కంటే మరింత మెరుగైన మార్కులు సాధించి పాఠశాలకు, ఇల్లందు పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. దేశభక్తి, సేవా భావాన్ని చిన్నారుల్లో పెంపొందించడంతో పాటు వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు వాసవి క్లబ్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు కటకం సత్యేంద్ర కుమార్, వనితా క్రౌన్ అధ్యక్షురాలు కటకం అలేఖ్య, ప్రధాన కార్యదర్శి తీర్దాల నాగరాజు, కోశాధికారి బోనగిరి రమేష్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వ్యామసాని జనార్దన్, డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ జొన్నల ఉపేంద్రనాథ్ గుప్తా, వనితా క్రౌన్ వాలంటీర్లు ప్రొద్దుటూరి సుమశ్రీ, కటకం ప్రణవి, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# వనవాసీ పరిషత్ కి సీలింగ్ ఫ్యాన్లు వితరణ





**చర్ల, ఆగస్టు 15 :(ప్రజా జ్యోతి):** వనవాసీల అభివృద్ధి, విద్య కోసం వనవాసీ కళ్యాణ పరిషత్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పూజారికాంకేర్ మాజీ సర్పంచ్ మజ్జా శోభారాణి అన్నారు. చర్లలోని కొమరం భీం విద్యార్థి నిలయంలో శనివారం నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా విద్యార్థుల అవసరాల కోసం రెండు సీలింగ్ ఫ్యాన్లను ఆమె వితరణగా అందజేశారు. అనంతరం కొమరం భీం విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి శోభారాణి మాట్లాడుతూ వనవాసీ విద్యార్థుల కోసం దేశవ్యాప్తంగా విద్యార్థి నిలయాలను ఏర్పాటు చేసి విద్యకు ప్రోత్సాహం అందించడం అభినందనీయమన్నారు.వనవాసీ కళ్యాణ పరిషత్ సేవలకు ఆకర్షితురాలై గత మూడేళ్లుగా తన వంతుగా విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందిస్తున్నట్లు శోభారాణి తెలిపారు. ప్రతి విద్యార్థి దేశభక్తి, క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వనవాసీ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ, జిల్లా సహ కార్యదర్శి గోగికార్ రాంలక్ష్మణ్, శబరి బాలికా నిలయ కార్యదర్శి బందా స్వరూప రాణి, కొమరం భీం సహ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, శబరి బాలికా నిలయ ప్రముఖ్ వరలక్ష్మి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం

- సొసైటీ అధ్యక్షులు కొత్వాల
- పాల్వంచ సొసైటీ కార్యాలయం ఎదుట పతాకావిష్కరణ చేసిన కొత్వాల



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 15,(ప్రజాజ్యోతి)** రైతు సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని పాల్వంచ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు, డి.సి.ఎం.ఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. 80 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం పాల్వంచ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యాలయం ఎదుట కొత్వాల పతాకావిష్కరణ చేశారు.ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు చేపట్టిందన్నారు. రైతులకు పెట్టుబడి సహాయం కింద ఎకరానికి రెండు విడతలుగా 12 వేల రూ॥ల ఆర్థిక సాయం, రైతులు పండించిన పంటలకు మద్దతు ధర, సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాకు 500 రూ॥ల బోనస్, రైతు భరోసా, రైతులకు ఉచిత విద్యుత్ వంటి పథకాలు చేపడుతున్నారన్నారు. రైతులు కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్వాలఅన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు బుడగం రామ్మోహన్ రావు, కనగాల నారాయణరావు చౌగాని పాపారావు, భూక్యా కిషన్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఖైరున్నిషా ప్రతిభకు నగదు ప్రోత్సాహం



**చర్ల, ఆగస్టు 15: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని తేగడ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గత ఏడాది జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో చర్ల మండల టాపర్‌గా నిలిచిన జెడ్పీహెచ్ఎస్ తేగడ పాఠశాల విద్యార్థిని ఎస్.డి. ఖైరున్నిషాకు చర్ల మండల ఎంఈఓ రమణ చేతుల మీదుగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రూ.5,000 నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.సువిధ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, కాలిఫోర్నియా, సువిధ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న ఫౌండేషన్ల సేవలు అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అన్నారు .విద్యార్థులను ప్రోత్సహిస్తూ విద్యారంగానికి తమ వంతు సహకారం అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులకు పాఠశాల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ఉన్నత లక్ష్యాలను సాధించేలా ప్రేరణనిస్తాయని వారు అన్నారు .ఈ సందర్భంగా సువిధ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, కాలిఫోర్నియా చైర్మన్ వెంపటి భాస్కరరావు, సువిధ వికాస్ ఫౌండేషన్ చైర్మన్ అమర్నేని మన్మధరావు, ఫౌండేషన్ సభ్యులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

## దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుల ఆశయాలను అనుసరించాలి

- డి.సి.ఎం.ఎస్ మాజీ ఛైర్మన్ కొత్వాలకార్పొరేటర్ విమలాదేవి





**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 15, (ప్రజాజ్యోతి)** దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన త్యాగధనుల ఆశయాలను ప్రతీ ఒక్క భారతీయుడు అనుసరించాలని డి. సి.ఎం.ఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. 80వ స్వాతంత్య దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొత్వాల ఆధ్వర్యంలో పాల్వంచ లో పలు చోట్ల పతాకావిష్కరణలు జరిపారు. శనివారం పాల్వంచ పట్టణ పరిధిలోని నటరాజ్ సెంటర్ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో పాత పాల్వంచ లోని గడియ కట్ట, పాత పాల్వంచ ఆటో యూనియన్, బొడ్రాయి సెంటర్ లో జెండాల బజార్, రామానంద తీర్థకాలని పాలకొయ్య తండాల లో కొత్వాల పతాకావిష్కరణలు చేశారు. పాత పాల్వంచ 46వ డివిజన్‌లో కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి పతాకావిష్కరణలు చేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజలకు అనేక సంక్షేమ ఫలాలు అందిస్తున్నదన్నారు. ప్రజలు కాంగ్రెస్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్వాల అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పి.టి.సి యర్రంశెట్టి ముత్తయ్య, కాంగ్రెస్ నాయకులు కొత్వాల సత్యనారాయణ, ఎస్.వి.ఆర్.కె ఆచార్యులు, సొసైటీ డైరెక్టర్ బుడగం రామ్మోహన్ రావు, పైడిపల్లి మహేష్, కందుకూరి రాము, వాసుమల్ల సుందర్ రావు, కాపా శ్రీను, షేక్ ఖాజామియా సయద్ కరీం, పులి సత్యనారాయణ, కాపర్తి వెంకటాచారి, వనమా చిన్నబాబు, బొందిల శేషగిరి, ఉండేటి శాంతివర్ధన్, పెంకె శ్రీను, బరిగడి దేవదానం, గంధమల్ల రాజయ్య, గంధం నరసింహారావు, ముత్యాల కోటేశ్వరరావు, ఏనుగుల శ్రీను, బూసి శ్రీను, చిన్న పండు, యాటా నాని, బొందిల బాలాజీ, బండారు తేజ, మసనం శరత్, కోడూరి కిరణ్, కొండూరి లక్ష్మణ్, రౌతు మల్లేష్, ఏనుగుల వెంకటేశ్వర్లు, యం.డి నషీర్,హమాలీ సంఘం నాయకులు మీసా లింగయ్య పాల్గొన్నారు.

# బీట్ ఆఫీసర్ మృతికి కారణమైన నలుగురు అరెస్ట్

- లక్ష్మీపురంలో ముగ్గురు.. నాగినేని ప్రోలు రెడ్డిపాలెంలో మరొకరి అరెస్ట్
- బైండింగ్ వైర్లు, గడ్డపలుగు, కర్రలు స్వాధీనం

**బూర్గంపహాడ్, ఆగస్టు 15 (ప్రజా జ్యోతి ):**
అటవీ జంతువులను అక్రమంగా వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చి, వాటి కారణంగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోత్ నవీన్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటనలో నలుగురు నిందితులను బూర్గంపహాడ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 11వ తేదీ రాత్రి నకిరేపేట అటవీ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు అటవీ జంతువులను వేటాడేందుకు అక్రమంగా విద్యుత్ తీగలను అమర్చిన క్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్, తన డీఆర్వో అనార్కలి, తోటి సిబ్బందితో కలిసి సంఘటనా ప్రాంతానికి వెళ్లగాఅటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చిన వ్యక్తుల కోసం సిబ్బందితో కలిసి గాలిస్తుండగా ప్రమాదవశాత్తు నవీన్ విద్యుత్ తీగను తాకారు. దీంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురైన ఆయన అక్కడికక్కడే మృతి చెందారు.

### ››› ఫిర్యాదు మేరకు కేసు నమోదు...

డీఆర్వో అనార్కలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బూర్గంపహాడ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ మృతికి కారణమైన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టా రు.దర్యాప్తులో భాగంగా నిందితుల ఆ చూకీ కోసం పోలీసులు గాలిస్తుండ గా, లక్ష్మీపురం గ్రామంలోని ఆవుల నా గిరెడ్డి ఇంట్లో ఆవుల నాగిరెడ్డి, దాసరి నరేష్, తాటి వీరబాబు ఉన్నట్లు సమాచారం తెలుసుకుని పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా ముగ్గురు పా రిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నా రు.అనంతరం పట్టుబడిన ముగ్గురు నిందితులు ఇచ్చిన సమాచారం మేర కు నాలుగో నిందితుడైన కన్నెదారి అనంతయ్యను నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలోని అతని నివాసం వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు.పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో ఆవుల నాగిరెడ్డి (44), తండ్రి గురువారెడ్డి, వృత్తి ట్రాక్టర్ డ్రైవర్, లక్ష్మీపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. రెండో నిందితుడు దాసరి నరేష్ (35), తండ్రి మల్లయ్య, మటన్ షాపు నిర్వహిస్తూ లక్ష్మీపురంలో నివాసం ఉంటున్నాడు.మూడో నిం దితుడు తాటి వీరబాబు (28), తండ్రి వెంకన్న, కూలీ పనులు చేస్తూ లక్ష్మీపురంలో నివాసం ఉంటున్నాడు. నాలు గో నిందితుడు కన్నెదారి అనంతయ్య (58), తండ్రి సెబాస్టియన్, వ్యవసా యం చేస్తూ నాగినేనిప్రోలు రెడ్డిపాలెం లో నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు.

### ››› సామగ్రి స్వాధీనం....

నిందితుల వద్ద నుంచి అటవీ జంతువులను వేటాడేందుకు ఉపయోగించినట్లు భావిస్తున్న బైండింగ్ వైర్లు, కర్రలు పాతేందుకు ఉపయోగించే గడ్డపలుగు,తదితర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చి అటవీ జంతువులను వేటాడడం చట్టవిరుద్ధమే కాకుండా ప్రజలు, అటవీశాఖ అధికారులు, ఇతర సిబ్బంది ప్రాణాలకు కూడా తీవ్ర ప్రమాదకరమని పోలీసులు హెచ్చరించారు.

### ››› కఠిన చర్యలు తప్పవు....

అరెస్ట్ చేసిన నలుగురు నిందితులను జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.అటవీ జంతువులను వేటాడేందుకు అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చడం ద్వారా అమాయక వన్యప్రాణుల ప్రాణాలు తీయడంతో పాటు, అటువంటి ప్రాంతాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ప్రాణాలకు ముప్పు కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

# ఉత్తమ హెల్త్ అసిస్టెంట్ అవార్డు అందుకున్న ప్రసాద్

**అశ్వరావుపేట ప్రజా జ్యోతి ఆగస్టు 15** అశ్వరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ .వి.బి ప్రసాద్ కి ఉత్తమ హెల్త్ అసిస్టెంట్ అవార్డు ఎనబై వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ చేతుల మీదుగా అందుకున్నారు. అశ్వరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సుదీర్ఘకాలంగా హెల్త్ అసిస్టెంట్ గా ఉత్తమ సేవలు అందించినందుకు ఈ అవార్డును అందజేశారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండటమే కాకుండా తనకు కేటాయించిన హాస్టల్స్ ను దర్శిస్తూ అక్కడ విద్యార్థుల యొక్క ఆరోగ్య రుగ్మతలను గుర్తించి వెంటనే జ్వరం వచ్చిన వారి నుండి రక్తపూతల సేకరించి, వెంటనే ఆర్డిటి పరీక్షలు చేసేవారు. అలాగే వసతి గృహాల చుట్టూ సానిటేషన్కు సంబంధించిన సలహాలు సూచనలు సంబంధిత నిర్వాహకులకు వివరంగా తెలియజేసి శుభ్రంగా ఉండేటట్లు కృషి చేసేవారు. గత సంవత్సరం ఆశా కార్యకర్తల సహాయంతో సుమారు రెండు వందల ఆయిల్ బాల్స్ తయారు చేయించి తన సెక్టార్లోని నిల్వ నీరు ఉన్న ప్రాంతాలలో ఆశా వర్కర్ల చే ఈ బాల్స్ వేయించి దోమల నిర్మూలనకు నడుంబిగించారు తద్వారా డెంగ్యూ మలేరియా దోమలను నిర్మూలించే కార్యక్రమాన్ని విజయవంతంగా , శక్తి వంచన లేకుండా కృషి చేశారు. తన విధులను నిర్వర్తిస్తూనే ఆసుపత్రిలో సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కారానికి ఉపక్రమించేవారు అందులో భాగంగా వినాయకపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసీ గదికి మందులు ఇచ్చే ప్రాంతంలో సరైన వసతి లేకుంటే వెంటనే కార్పెంటర్ని పిలిపించి , డోరు ఏర్పాటు చేయించి అందంగా తయారు చేశారు అంతకుముందు డోర్



లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడేవారు, అంతేకాకుండా వినాయకపురం ఆసుపత్రి ఆవరణలో పేషెంట్లు వచ్చినప్పుడు కూర్చోవడానికి సరైన వసతులు లేకపోవడం గమనించి వెంటనే ప్రైవేటు స్కూల్ యాజమాన్యం వాళ్లను, వికేడివి కళాశాల వారిని, వాసవి క్లబ్ వారిని మరియు పలువురు దాతలను సంప్రదించి సమస్య వివరించి అక్కడ వచ్చినటువంటి పేషెంట్లు ఎలాంటి ఇబ్బంది పడకుండా కూర్చోవడానికి సుమారు ఎనిమిది సిమెంటు బల్లలు వేయించారు. అలాగే అశ్వరావుపేట రూరల్ సబ్ సెంటర్ నందు గతంలో పనిచేసిన ఏఎన్ఎం వెంకటరమణ సహాయంతో సుమారు పన్నెండు వేల రూపాయలు వెచ్చించి పల్లె దవ ఖానా చుట్టూ ఫెన్సింగ్ , గేటు , సొంతంగా డబ్బులు చేరి సగం వేసుకొని తయారు చేయించారు. ఆశా కార్యకర్తలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ తగు జాగ్రత్తలు ఇస్తూ ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే ను మరియు ప్రతి మంగళవారం డ్రై డే ట్యూస్డేను సక్రమంగా వారిచే చేయించేవారు అవసరమైన చోట హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయించేవారు. గత సంవత్సరం వినాయకపురం ఆసుపత్రి ఆవరణలో జెండా ఎగురవేయుటకు సరియైన దిమ్మ లేకపోవడం గుర్తించి వెంటనే స్వతహాగా సుమారు నాలుగు వేల రూపాయలు వెచ్చించి బ్రహ్మాండమైన జెండా దిమ్మెను నిర్మించడం జరిగింది. వినాయకపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న మొత్తం అరవై మంది ఆశా కార్యకర్తలకు రక్తపూతల పుస్తకాలను ఉచితంగా వైద్యాధికారి గారి చేతుల మీదుగా వారందరికీ ఇప్పించడం జరిగింది. దీనికి సుమారు నాలుగు వేల రూపాయలు స్వంతంగా వెచ్చించడం కూడా జరిగింది. అలాగే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సూచనల మేరకు అశ్వారావుపేట రూరల్ సబ్ సెంటర్ నందు పచ్చదనం పరిశుభ్రం లో భాగంగా పూల మొక్కలు అనేక కూరగాయల మొక్కలు, ములగ, గోంగూర మొక్కలు వేసి ఆశా కార్యకర్తల సహాయంతో వాటిని పరిరక్షించి ఆకుకూరలు, కాయగూరలు తాజాగా కొంతమంది సిబ్బందికి ఆయా ప్రాంతాల ప్రజలకు ఉచితంగా అందజేయడం జరిగింది. ఇలా కేవలం ఉద్యోగ బాధ్యతలే కాకుండా సామాజిక బాధ్యతలను కూడా గుర్తించి పలుమార్లు పాత రింగ్ రోడ్ లో ఉన్న ఆస్పత్రి ఆవరణలో కలుపు మందు కొట్టించడం మరియు బ్లేడ్ ట్రాక్టర్ తో శుభ్రం చేయించడం మొదలు కార్యక్రమాలు చేయించారు. ఈ ఎనబై స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ హెల్త్ అసిస్టెంట్ అవార్డు అందుకున్న ప్రసాద్ కి పలువురు తోటి ఉద్యోగులు ఇతర శాఖల సిబ్బంది , మరియు ఆశా కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

# అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట..

- ఆపన్నులకు అండగా ఎమ్మెల్యే జారె ... పలు అభివృద్ధి, కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**దమ్మపేట, ఆగస్టు 15(ప్రజాజ్యోతి):** ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, ఆపన్నులకు అండగా నిలవడమే లక్ష్యంగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దమ్మపేట మండలంలో పలు అభివృద్ధి, సంక్షేమ, పరామర్శ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని పట్వారిగూడెం గ్రామంలో సుమారు రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఖబరిస్తాన్ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రంగువారిగూడెం గ్రామంలో ఇటీవల ప్రమాదానికి గురైన ఎర్ర రాంబాబు, దమ్మపేట టీటీడీ కళ్యాణ మండపం వద్ద మద్దల గంగా భవానికి ఒక్కొక్కటి రూ.1 లక్ష విలువైన ట్రై సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. వికలాంగులు స్వావలంబనతో జీవించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం అంకంపాలెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన అడపా వీర్రాజు పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దుఃఖ సమయంలో కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు తమ సమస్యలను వివరించగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముువ్వన్నెల జెండాలతో మార్మోగిన ఆళ్ళపల్లి

- ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




**ఆళ్ళపల్లి,ఆగస్టు15(ప్రజా జ్యోతి)** మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, గ్రామ పంచాయతీల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ముువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేశారు.తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్, గ్రామపంచాయతీలో సర్పంచ్ వాసం సుస్మిత, రైతువేదికలో ఏవో కుమార్ రాజా, ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ గోపిలాల్, పశువైద్యశాలలో డాక్టర్ వివేక్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సోమేశ్వర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా భగత్‌సింగ్ సెంటర్‌లో రేసు ఎల్లయ్య, బస్టాండ్ సెంటర్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్, విద్యా వనరుల కార్యాలయంలో ఎంఈఓ కొమరం శాంతారావు, శాంతి విద్యానికేతన్‌లో ఫాదర్ జేసు ప్రసాద్ జెండాను ఎగురవేశారు. మర్కోడు గ్రామపంచాయతీలో సర్పంచ్ సుతారి రమాదేవి, ఆశ్రమ పాఠశాలలో హెచ్ఎం ఈసం ముత్తయ్య, జెడ్పీ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ హెచ్ఎం బాబూలాల్, ఎంపీపీఎస్‌లో హెచ్ఎం అగ్గి రామకృష్ణ, జిన్నెలగూడెం పాఠశాలలో హెచ్ఎం నాగేశ్వరరావు పాల్గొన్నారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో విజయ, సుభద్ర, అక్షర విద్యాలయంలో కరస్పాండెంట్ కీసరి రమేష్, బొడ్రాయి సెంటర్‌లో మాజీ జెడ్పీటీసీ కొమరం హనుమంతరావు, కాంగ్రెస్ గద్దె వద్ద సీనియర్ నాయకులు కృష్ణారి, అంబేద్కర్ ఎస్సీ కాలనీలో కోనేటి వీరభద్రచారి జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలల్లో కూడా స్వాతంత్ర్య వేడుకలు ఉత్సాహంగా జరిగాయి.

## కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు

- జాతీయ జెండాను ఆవిష్కరించిన మండల అధ్యక్షుడు రమేష్ బాబు



**అశ్వాపురం, అగస్ట్ 15,ప్రజాజ్యోతి** అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఒరుగంటి రమేష్ బాబు జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన త్యాగాలు, పోరాటాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను నేటి తరానికి తెలియజేయడంతో పాటు దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.

**ఉత్సాహంగా పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాకు వందనం చేసి దేశభక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు స్వాతంత్ర్య సమరయోధుల సేవలను కొనియాడారు.

## జెండాను ఎగురవేసిన ఐఏఎస్ గా ఎంపికైన పూర్వ విద్యార్థిని



**ఇల్లందు, ఆగస్ట్ 15 (ప్రజాజ్యోతి)** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 14 నెంబర్ బస్తీలోని మార్గదర్శిని హై స్కూల్‌లో శనివారం నిర్వహించిన వేడుకలకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థిని, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్సి) నిర్వహించిన సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి భారత పరిపాలనా సేవ (ఐఏఎస్)కు ఎంపికైన భావి ఐఏఎస్ అధికారి లక్ష్మీ రచన జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ మార్గదర్శిని పాఠశాల పూర్వ విద్యార్థిని దేశంలో అత్యున్నత సేవల్లో ఒకటైన ఐఏఎస్ కు ఎంపిక కావడం సంతోషకరమన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి లక్ష్మీ రచనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. లక్ష్మీ రచన విజయం ఈ ప్రాంత యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం కుమారి లక్ష్మీ రచన మాట్లాడుతూ ఐఏఎస్ సాధించడం ఎంతో కఠినమైన లక్ష్యమైనప్పటికీ సరైన ప్రణాళిక, అంకితభావం, పట్టుదల, నిరంతర శ్రమ, క్రమశిక్షణతో దానిని తప్పకుండా సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. తాను ఈ స్థాయికి చేరుకోవడంలో కీలక పాత్ర పోషించిన తన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పాఠశాల డైరెక్టర్లు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యాదగిరి రాంబాబు, అర్వపల్లి విఎస్ఆర్ కృష్ణ, దమ్మాలపాటి నాగేంద్ర ప్రసాద్, కొంగర బ్రహ్మం, యాదగిరి కృష్ణార్జునరావులు లక్ష్మీ రచనను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దమ్మపేటలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకావిష్కరణ



**దమ్మపేట, ఆగస్టు 15(ప్రజాజ్యోతి):** దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దమ్మపేట మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.

### »» తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు

దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ), తహసీల్దార్ మద్దినేని మురళి ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మద్దినేని మురళి మాట్లాడుతూ స్వాతంత్ర్యం ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమని అన్నారు. దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని, ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించడమే ప్రభుత్వ అధికారుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ఎంపీడీవో కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు



**దమ్మపేట, ఆగస్టు 15(ప్రజాజ్యోతి):** దమ్మపేట ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బి. రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీడీవో రవీందర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## సహకార పరపతి సంఘంలో వేడుకలు



**దమ్మపేట, ఆగస్టు 15(ప్రజాజ్యోతి):** దమ్మపేట సహకార పరపతి సంఘం ఉపాధ్యక్షులు కట్టం యర్రప్ప ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సహకార రంగం బలోపేతంతో రైతులు, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చని అన్నారు. రైతుల అభ్యున్నతి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.